క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ముసునూరు: రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు చిత్తూరులో జరిగిన అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల అండర్–14 విభాగంలో రమణక్కపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ఇందుప్రియ, రమ్య, బ్లెస్సీ, హర్షిత ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు తృతీయ స్థానం సాధించడంలో ముఖ్య భూమిక పోషించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు, శిక్షణ ఇచ్చిన పీడీ వాకా నాగరాజుకు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందనలు తెలిపారు.

ఈఏపీ సెట్ పరీక్షలు ప్రారంభం



తిరువూరు: ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్షలు మంగళవారం తిరువూరు శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ నెల 27 వరకు రోజుకు రెండు సెషన్స్‌లో జరిగే ఈ పరీక్షలకు రెండు వేల మంది విద్యార్థులను కేటాయించారని కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు.

సీపీఐ పట్టణ, మండల కార్యవర్గాల ఎన్నిక

తిరువూరు: సీపీఐ తిరువూరు పట్టణ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సుంకర వీరభద్రరావు భవన్‌లో జరిగిన పట్టణ మహాసభలో పట్టణ కార్యదర్శిగా మాలపాటి ఉదయ్, సభ్యులుగా నాగుల్‌మీరా, బాణాల అశోక్, ఎస్‌కే మస్తాన్, ఎస్‌కే సుబానీ, హసన్, మరియమ్మ, బత్తుల వెంకటేష్, పాలకుర్తి సునీల్, మేడేపల్లి నరసింహారావు ఎన్నికయ్యారు. పార్టీ తిరువూరు మండల కార్యదర్శిగా నృసింహాద్రి వనమాలి, సభ్యులుగా డి. అమర్‌నాథ్, పి. రవి, వి. వెంకటేశ్వరరావు, జి. వెంకటేశ్వరరావు తదితరులు ఎన్నికయ్యారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, జిల్లా నాయకులు తూము కృష్ణయ్య, నాగుల్‌మీరా, చిలుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి తీరువా బకాయిలు చెల్లించాలి

చాట్రాయి: నీటి తీరువా బకాయిలు త్వరితగతిన చెల్లించాలని తహసీల్దార్ ఈశ్వరరావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నీటి తీరువా బకాయిలు సుమారు రూ.40 లక్షలు ఉన్నాయని, రైతులు త్వరితగతిన గ్రామ సచివాలయాల్లో చెల్లించాలని ఆయన కోరారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

జి.కొండూరు: ఆంధ్రప్రదేశ్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా బీసీ–సి, సిక్కు, పార్సీ, మైనార్టీ వర్గాల వారి నుంచి సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు. ఆయా వర్గాలకు చెందిన వారు సబ్సిడీ రుణాలకు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

పెద్ద చెరువు ఆక్రమణల పరిశీలన

విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లిరోడ్డులోని పెద్ద చెరువు ఆక్రమణలకు గురవుతున్నట్లు వచ్చిన ఆరోపణలపై ఎంపీడీఓ చినరాట్నాలు మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు ఆక్రమణలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ గాయత్రి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

దాసాంజనేయ స్వామికి విశేష పూజలు

నందిగామరూరల్: మండలంలోని కె.కంచ్రిక గ్రామంలో వేం చేసి ఉన్న దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామి వారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 22న హనుమత్ జయంతి సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, నాగవల్లి అర్చన, లక్ష్మీగణపతి, నవగ్రహ హోమాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మేడా రామారావు తెలిపారు. మండలంలోని పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

దశాబ్దాలుగా ఇంతే!

- అభివృద్ధికి నోచుకోని యనమదల–పోరాట నగర్ రహదారి
- పలు గ్రామాలకు ఇది దగ్గర దారి
- అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగం
- ఏళ్ల తరబడి గ్రామస్తుల ఎదురుచూపులు



అభివృద్ధికి నోచుకోని యనమదల–పోరాట నగర్ రహదారి

నూజివీడు: గ్రామాల మధ్య ఉన్న లింకు రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేస్తే గ్రామాల మధ్య దూరం తగ్గి రాకపోకలు సులభతరమవుతాయి. అంతేకాకుండా వ్యవసాయ భూముల రేట్లు కూడా పెరిగే అవకాశాలున్నాయి. పాలకులు వీటిని పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. వీటిని తారు రోడ్లుగా అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తారు రోడ్డు వేస్తే దూరాభారం తగ్గుతుంది

మండలంలోని యనమదల నుంచి మైలవరం మండలం పోరాట నగర్‌కు మట్టిరోడ్డు ఉన్నప్పటికీ ఇది దశాబ్దాల తరబడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇది తారురోడ్డుగా అభివృద్ధి చెందితే పలు గ్రామాలకు దగ్గర దారి ఏర్పడటంతో పాటు నూజివీడుకు దూరాభారం తగ్గుతుంది. యనమదల నుంచి మైలవరం మండలం పోరాట నగర్ మీదుగా కనిమెర్ల తండా వరకు అభివృద్ధి చేస్తే నూజివీడు నుంచి రెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాలకు దూరం తగ్గుతుంది. దీనివల్ల నాగులూరు, నాగులూరు తండా, పాత నాగులూరు, తాడిగూడెం, వెలగలగూడెం, బూరుగగూడెం, సాయంపాలెం తదితర ప్రాంతాల నుంచి నూజివీడుకు దూరం తగ్గుతుంది. ప్రస్తుతం వారందరూ నూజివీడు రావాలంటే చంద్రాల మీదుగా గాని, రెడ్డిగూడెం మీదుగా గాని తిరిగి వస్తున్నారు. దీనివల్ల దాదాపు 25 కిలోమీటర్ల దూరం అవుతోంది. అదే యనమదల–కనిమెర్ల తండా రోడ్డును అభివృద్ధి చేస్తే దూరం 18 కి.మీ. మాత్రమే కావడంతో నూజివీడుకు బాగా దగ్గర అవుతుంది. అలాగే యనమదల, సుంకొల్లు, రేగుంట తదితర గ్రామాల ప్రజలు నాగులూరు, పాత నాగులూరు, బూరుగగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లడానికి దగ్గర దారి అందుబాటులోకి వస్తుంది.

వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు సులభం..

ఈ మార్గంలో వందలాది ఎకరాల్లో మామిడి తోటలుండటమే కాకుండా అటవీ భూముల్లో పేదలు టమోటా, చిక్కుడు, వంగ తదితర కూరగాయలను, పత్తి పంటను సాగుచేస్తున్నారు. రోడ్డు మార్గం ఏర్పడితే రైతులు పండించే వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి రైతులకు ఎంతో సులువుగా ఉంటుంది. ముందుగా యనమదల నుంచి గట్టువరకు మూడు కిలో మీటర్ల మేర తారు రోడ్డును నిర్మిస్తే పరిస్థితి కొంతలో కొంత మెరుగవుతుంది. ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు అభివృద్ధి చేసుకునేందుకు వీలున్నందున ఎలాగైనా ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దూరం తగ్గి రాకపోకలు పెరుగుతాయి



యనమదల నుంచి పోరాట నగర్ వెళ్లే దారిని తారురోడ్డుగా అభివృద్ధి చేయాలి. దీనివల్ల మైలవరం, రెడ్డిగూడెం మండలాల్లోని గ్రామాలకు దూరం తగ్గడమే కాకుండా గ్రామాల మధ్య రాకపోకలు పెరుగుతాయి. అంతేగాకుండా వ్యవసాయ భూముల ధరలు కూడా పెరిగి రైతులకు లాభం చేకూరుతుంది.

– నీలపాల కోటేశ్వరరావు, యనమదల, నూజివీడు మండలం

తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలి



యనమదల–పోరాట నగర్‌ల మధ్య తారురోడ్డు నిర్మిస్తే మామిడి తోటలు, పేదలు సాగు చేసుకుంటున్న అటవీ భూముల్లోకి వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. వ్యవసాయోత్పత్తులను తీసుకు వచ్చేందుకు, మార్కెట్‌కు తరలించేందుకు వీలుగా ఉంటుంది. తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– వెలివల శివరామకృష్ణప్రసాద్, సుంకొల్లు, నూజివీడు మండలం

గ్రామ గ్రామాన టీడీపీ గ్రూపు రాజకీయాలు

- మైలవరం మినీ మహానాడులో ఎమ్మెల్యే వసంత వ్యాఖ్యలు
- ఎమ్మెల్యే వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ

మైలవరం: మైలవరంలో నిర్వహించిన టీడీపీ మినీ మహానాడు సాక్షిగా నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామ గ్రామాన గ్రూపు రాజకీయాలు ఉన్నట్లు తేటతెల్లమైంది. ఈ విషయాన్ని సాక్షాత్తు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు పార్టీ కోసం సమన్వయంతో పనిచేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల తరువాత పార్టీ అధికారంలో ఉన్న ఏడాది కాలంగా గ్రామ గ్రామాన వర్గాలుగా విడిపోయి పార్టీకీ తలనొప్పిగా మారారని వ్యాఖ్యానించారు. ఒక వర్గానికి తాను అంగీకరిస్తే మరో వర్గం వ్యతిరేకిస్తుందని, దీని వలన అభివృద్ధి పనులకు వ్యక్తగత పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. కొందరు వ్యక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం టీడీపీ గ్రామాధ్యక్ష ఎన్నికల్లో వివాదాలు సృష్టిస్తున్నారని చెప్పారు. ఒక వర్గానికి మద్దతు పలుకుతూ మరో వర్గాన్ని వ్యతిరేకించే నాయకులు ఎటువంటి వారినైనా సహించేది లేదన్నారు. నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. తాను నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం నాయకులంతా ఒక తాటిపై ఉండాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడిన తీరుకు నాయకులంతా ఆశ్చర్యానికి గురయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడిన తీరును చూసి నియోజకవర్గ టీడీపీ మూడు ముక్కలాటగా మారిందని, రానున్న కాలంలో ఎమ్మెల్యే మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

శిథిలావస్థలో చాట్రాయి పీహెచ్‌సీ భవనం

శ్లాబు పెచ్చులూడి పడుతున్న వైనం

చాట్రాయి: మండలంలోని చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా వైద్యులు వైద్యం చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ 150 నుంచి 200 వరకు ఆస్పత్రికి వచ్చే రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలు, దర్వాజాలకు చెదలు పట్టాయి. సిబ్బంది వినియోగించే టాయిలెట్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకంలో సుమారు రూ.30 లక్షల నిధులను ఆస్పత్రి మరమ్మతుల నిమిత్తం మంజూరు చేసింది. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించింది. అయితే కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేయడంతో మరోసారి టెండర్లు పిలిచినా ఎవ్వరూ రాలేదు. దీంతో ఆస్పత్రి మరమ్మతు పనులు నిలిచిపోయాయి. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుని ఆపరేషన్ థియేటర్ అనువుగా లేకుండా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించలేకపోతున్నామని పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి తెలిపారు. దీంతో మండలంలోని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకునే మహిళలు నూజివీడు ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆస్పత్రికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



శ్లాబ్ పెచ్చులూడిన చాట్రాయి పీహెచ్‌సీ భవనం

ఎయిడ్స్‌పై కళాజాతా ప్రదర్శన

ఇబ్రహీంపట్నం: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై కళాజాతా ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి రావడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులపై వివక్ష చూపకుండా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సుఖవ్యాధులు, టీబీ వ్యాధి చికిత్సలు, సమాజంలో వారిని ఆదరించడం వంటివి వీధి నాటకం ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్నేహ ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై యాసిడ్ దాడి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఉపాధ్యాయిని సోమవారం రాత్రి యాసిడ్ దాడికి పాల్పడింది. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన ప్రిన్సిపాల్‌ను గొల్లపూడిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాలలో ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రియదర్శిని ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. పాఠశాల యాజమాన్యం నెల రోజుల కిందట వివిధ కారణాలు చూపి ఆమెను విధుల నుంచి తొలగించారు. తనను తొలగించడంపై ఆరా తీసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వచ్చిన ఆమె ప్రిన్సిపాల్ విజయ ప్రకాష్‌ను ప్రశ్నించింది. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆమెతో పాటు తెచ్చుకున్న యాసిడ్ బాటిల్ ప్రిన్సిపాల్‌పై విసిరింది. ఈ దాడిలో ప్రిన్సిపాల్ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మండలాభివృద్ధికి సహకరించాలి

ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి



మాట్లాడుతున్న ఎంపీపీ మెర్సీ వనజాక్షి

విస్సన్నపేట: విస్సన్నపేట మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అన్నారు. విస్సన్నపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, అన్ని ప్రాంతాలకు చెత్త సేకరణ వాహనాలు వెళ్లాలని చెప్పారు. రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాలు జరుగుతున్నందున పశు యజమానులకు తగు అవగాహన కల్పించాలని పశువైద్యాధికారులను కోరారు. తహసీల్దారు లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ చినరాట్నాలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త నిర్వహణలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. సిబార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ (గుంటూరు) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. చిగుళ్ల నుంచి రక్తస్రావం జరగటం, పిప్పి పళ్లు, ప్రమాదాల కారణంగా విరిగిన పళ్లు తదితర సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేసి విద్యార్థులకు మందులిచ్చారు. తొలుత జరిగిన సమావేశంలో ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ దంత సమస్యలు కేవలం వృద్ధాప్యంలోనే వస్తాయనే భావన చాలామందిలో ఉందని, అది పూర్తిగా అపోహ మాత్రమేనన్నారు. సమస్యను తొలి దశలో అశ్రద్ధ చేయడం వల్ల దంతాలు తీసే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. దంతాల సమస్యలకు చిట్కా వైద్యం ఉత్తమం కాదన్నారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, దంత వైద్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మికుల నిరసన



మైలవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



కొండపల్లి ఐడీఏలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కొండపల్లి ఐడీఏలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయు పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు కాలరాస్తున్న లేబర్ కోడ్స్ రద్దు చేసి స్కీమ్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని, ప్రైవేటీకరణ ఆపాలని, ఆటో, ముఠా, బిల్డింగ్, హాకర్స్, రవాణా, రంగాలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, విద్యుత్ రంగ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 9న జాతీయ సమ్మె విజయవంతం చేయాలని కోరారు. పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో తమ న్యాయమైన సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ పోరాటాలు చేసైనా సమస్యలు పరిష్కరింపజేసుకుంటామని ప్రకటించారు. పలువురు ఆశాలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలి

మైలవరం: లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్ట్, స్కీం వర్కర్స్ పర్మినెంట్ చేయాలని, ముఠా, ఆటో, హాకర్స్, బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చాట్ల సుధాకర్ డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ జూలై 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మైలవరం పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద నుంచి విజయవాడ బస్‌స్టాప్ వరకు కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి. జ్యోతి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఎర్రంశెట్టి వీరమ్మ, చంద్రరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు మాదు శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



నూజివీడులో కార్మికుల నిరసన ప్రదర్శన

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయడంతో పాటు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి జి. రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెలో భాగంగా మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ఆటో, హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎస్ఆర్ హనుమాన్లు, నాయకులు సంసోను, రజని, రంగారావు, నాగూర్, సాంబశివరావు, ఏసుబాబు, ఉషారాణి, పద్మాంజలి, శోభనాద్రి, మరియదాసు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

- ముసునూరు: లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం సీఐటీయూ జిల్లా నాయకుడు జి.రాజు ఆధ్వర్యంలో చింతలవల్లి, చెక్కపల్లి, ముసునూరులో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ముసునూరు మండపం సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో రాజు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రోజువారీ కూలీలకు, ఆటోవాలాలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, కంచర్ల రమేష్, పోతురాజు, దుర్గారావు, రంగారావు, మంగారావు, పిన్నిబోయిన శ్రీను పాల్గొన్నారు.

విజ్ఞానం... వినోదం

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు

- సెలవుల్లో విజ్ఞాన సముపార్జనకు అవకాశం
- శాస్త్రీయ దృక్పథం పెంపునకు జేవీవీ కృషి
- పుస్తక పఠనంపై విద్యార్థుల ఆసక్తి



తిరువూరు గ్రంథాలయంలో కరాటేలో శిక్షణ పొందుతున్న బాలలు



పెనుగొలను గ్రంథాలయంలో తాము వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

తిరువూరు: విద్యా సంవత్సరం ముగిసిన తర్వాత వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా పలు సంస్థలు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాయి. ఈ శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటున్నాయి. తిరువూరు నియోజకవర్గంలోని తిరువూరు, గంపలగూడెం, పెనుగొలను గ్రంథాలయాల్లో, తిరువూరు సుందరయ్య భవన్‌లో వేసవి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా చిత్రలేఖనం, నృత్యం, పాటలు పాడటం, భగవద్గీత కంఠస్తం చేయడం, కథనం చెప్పడం తదితర కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థినీ విద్యార్థులకు మొబైల్స్ మోజు తగ్గించేందుకు కూడా ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడుతున్నాయి.

విజ్ఞానదాయక శిక్షణ

తిరువూరులో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో పేపర్ క్రాఫ్ట్ తయారీ, బొమ్మలు వేయడంలో ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులు పై తరగతులకు వెళ్లినపుడు వేసవి శిక్షణా కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలు ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ ఇంగ్లిష్ గ్రామర్‌లో ఇస్తున్న శిక్షణ కూడా విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటోందని చెబుతున్నారు. గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా ప్రతి రోజూ ఒక గంట సేపు పుస్తక పఠనం తప్పనిసరి చేస్తుండటంతో విజ్ఞానదాయక పుస్తకాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

జేవీవీ శిక్షణతో సత్ఫలితాలు

జన విజ్ఞాన వేదిక విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనా దృక్పథం పెంచడానికి, మూఢ నమ్మకాలు పారదోలడానికి వేసవి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాణామతి, చేతబడి వంటి మూఢ నమ్మకాలను విశ్వసించే గ్రామీణ కుటుంబాల విద్యార్థులకు జేవీవీ శిక్షణా తరగతుల్లో చెబుతున్న అంశాలతో కొంత మార్పు వస్తోంది. ఇంద్రజాల ప్రదర్శనలు, లాజికల్ మ్యాథ్స్, సైన్స్ ప్రయోగాలు, కరాటే, చదరంగంలో శిక్షణ విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలకు పదును పెడుతోంది.

విద్యార్థులకు ప్రయోజనకరం



వేసవి శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. సెలవులు వృథా చేయకుండా, పోటీ ప్రపంచంలో ఇతర విద్యార్థులకంటే ముందుండటానికి శిక్షణా తరగతులు ఉపయోగపడతాయి.

– రాంప్రదీప్, జన విజ్ఞాన వేదిక సభ్యుడు

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



ఆగిరిపల్లి: మండలంలో మంగళవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత కొన్నిరోజులుగా ఉక్కపోత, వేడిగాలులతో ఇబ్బంది పడుతున్న మండల ప్రజలు వర్షం కురిసి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. నాలుగు గంటలకు పైగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీ ఆక్రమణల కారణంగా వర్షం నీరు మొత్తం రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు.

- ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈనెల 22వ తేదీ హనుమత్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శీనానాయక్ తెలిపారు. ఘాట్‌రోడ్డులోని వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో, పాత మెట్ల మార్గంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, నాగవల్లీ దళార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.